క్లుప్తంగా

పేర్ని నాని కారుపై దాడి హేయనీయం

టెక్కలి: మాజీ మంత్రి పేర్ని నాని కారుపై జనసేన కార్యకర్తలు దాడి చేయడం హేయనీయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో ఎన్నడూ లేని విధంగా విధ్వంసకరమైన సంఘటనలకు పాల్పడుతూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. ఒక వైపు మహిళలు, విద్యార్థినులపై అఘాయిత్యాలు జరుగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అవేమి పట్టించుకోకుండా కేవలం కక్ష పూరితమైన చర్యలకు ఉసిగొలుపుతున్నారని ఆరోపించారు.

ఐటీడీఏ డీడీ కార్యాలయాన్ని జిల్లాకు తరలించాలి

టెక్కలి: ఐటీడీఏ డీడీ కార్యాలయాన్ని జిల్లాకు తరలించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి కోరారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాల విభజన అనంతరం శ్రీకాకుళం జిల్లాలో ఆదివాసీలకు ఐటీడీఏ లేకుండా చేశారన్నారు. జిల్లాకు డీడీ కార్యాలయం తరలించాలని గతంలో గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ కార్యరూపం దాల్చలేదని వెల్లడించారు. మన్యం జిల్లాలో రెండు ఐటీడీఏ డీడీ కార్యాలయాలను నిర్వహిస్తున్నారని ఆయన గుర్తు చేశారు

నేడు వైఎస్సార్ వర్ధంతి

టెక్కలి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆదివారం తెలిపారు. టెక్కలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

☛ **సోంపేట:** వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని సోంపేట పట్టణంలోని బస్టాండు వద్ద గల విగ్రహం వద్ద సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావురావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

కుప్పం, నిమ్మాడ నుంచి పింఛన్లు దర్యాప్తు చేయాలి

టెక్కలి: పింఛన్ల ప్రక్షాళన అంటూ మంత్రి అచ్చెన్నాయుడు పలుమార్లు ప్రకటనలు చేస్తున్నారని.. అయితే కుప్పం, నిమ్మాడ నుంచే పింఛన్లపై దర్యాప్తు చేయాలని నీటి సంఘం మాజీ అధ్యక్షుడు సత్తారు వెంకటరమణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మంత్రి అచ్చెన్నాయుడు పలు సందర్భాల్లో అనర్హత కలిగిన పింఛన్లు తొలగించేస్తామని చెబుతూ కక్ష సాధింపు చర్యలకు సిద్ధమవుతున్నారని వెంకటరమణ అన్నారు. కుప్పం, నిమ్మాడ నుంచి పింఛన్లపై అధికారులతో దర్యాప్తు నిర్వహించి ఆ తరువాత రాష్ట్ర వ్యాప్తంగా దర్యాప్తు చేస్తే బాగుంటుందన్నారు.

పింఛన్లను అందించండి

ఇచ్ఛాపురం రూరల్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేశామన్న కారణంతో తమకు పింఛన్ ఇవ్వకుండా అన్యాయంగా నిలిపివేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. మశాఖపురం గ్రామానికి చెందిన దల్లి రామకృష్ణ (దివ్యాంగుడు), నేగిరెడ్ల తుంభనాథం (వృద్ధాప్యం), బాకి కురమ్మ (వితంతు), ఆశి దాలమ్మ (ఒంటరి మహిళ), కన్నిండి మోహినమ్మ(ఒంటరి మహిళ)లకు సంబంధించి సెప్టెంబర్ నెల పింఛన్లు నిలిపివేయడంతో ఒకటో తేదీన అధికారులు డబ్బులు ఇవ్వలేదు. అర్హత పత్రాలను శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయానికి సమర్పించినప్పటికీ అధికారులు పింఛన్ ఇవ్వలేదని బాధితులు వాపోయారు. అధికారులు న్యాయం చేసి సోమవారం పింఛన్ డబ్బులు అందించాలని వేడుకున్నారు.

పూండిలో దొంగలుపడ్డారు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పూండి, పరిసర గ్రామాల్లో వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు ఉలిక్కి పడ్డారు. పూండి గోవిందపురం గ్రామానికి చెందిన పేరాడ విజయ్‌కుమార్ ఇంటిలో శుక్రవారం రాత్రి దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ఇంటి తలుపు తాళాలను పగలుగొట్టి ఇంటిలో ఉన్న బీరువా, పెట్టె, ఇతర ప్రాంతాలో ఉన్న వస్తువులను ధ్వంసం చేశారు. బీరువాలో ఉన్న తులం బంగారాన్ని చోరీ చేశారు. బాధితుడు ఉద్యోగ రీత్యా కాకినాడలో ఉండటంతో ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుని బంధువు కణితి నారాయణమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ రామారావు ఆదివారం తెలిపారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

వజ్రపుకొత్తూరు రూరల్: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పూడిలంకలో అధికారులు ఆదివారం పర్యటించారు. పల్లివూరు జంక్షన్ నుంచి పూడిలంక వరకు పడవపై ప్రయాణం చేసి గ్రామానికి చేరుకుని ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితిలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. మండల ప్రత్యేకాధికారి దేవి ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ బి.బాల, ఎంపీడీవో ఈశ్వరమ్మ ఉన్నారు.

• కార్యకర్తకు అండగా..



కవిటి మండలం కొత్తపుట్టుగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సప్పు జగ్గారావు కుమారుడు, వైఎస్ జగన్ సేవాదళ్ సభ్యుడు సిద్దు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆదివారం సిద్దును పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నర్తు రామారావు చారిటబుల్ ట్రస్టు ద్వారా సిద్దుకు పది వేల రూపాయల సాయాన్ని అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నర్తు అశోక్, నర్తు శీతయ్య, సప్పు శ్రీనివాసరావు ఉన్నారు. – కవిటి

• ఔదార్యం..

సంతబొమ్మాళి మండలం బడే కుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి ఔదార్యాన్ని చాటుకుంది. సంతబొమ్మాళికి చెందిన గోటివాడ ప్రసన్నకుమార్ పెయింటింగ్ పనిచేస్తూ పైనుంచి కిందకి పడడంతో గాయాలయ్యాయి. స్పందన ఫౌండేషన్‌ను ఆశ్రయించగా వారికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించింది. అలాగే మలగాం పంచాయతీ సూరడవానిపేటకు చెందిన పరిమల్లి కొర్లెమ్మ కొన్నాళ్లుగా ఆక్యూట్ ట్యూబర్క్యులోసిస్‌తో బాధపడుతుండడంతో 25 కేజీల బియ్యంతో పాటు 25 రకాల నిత్యావసర వస్తువులు, రూ. 3 వేలు నగదును సాయంగా అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు షణ్ముఖరావు మాస్టార్, సర్వాపురం సర్పంచ్ భూషణరెడ్డి, మలగాం మాజీ సర్పంచ్ బుచ్చ మురళి, శిమ్మన్న, శివారెడ్డి, మల్లేసు, నాగరాజు ఉన్నారు. – సంతబొమ్మాళి



• ఆవిర్భావ దినోత్సవం



స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ ఆవిర్భావ దినోత్సవాన్ని సోంపేట శాఖా కార్యాలయంలో సిబ్బంది ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సృజనాత్మక పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ సిబ్బంది డి.జోగారావు, పి.ధనుంజయ, కనకరాజు, సుష్మ, ఇచ్ఛాపురం, పలాస నియోజక వర్గాల పరిధిలోని బ్యాంకు సిబ్బంది హాజరయ్యారు. – సోంపేట

అధ్వాన రోడ్లతో అవస్థలు!

ఇటీవల కురిసిన వర్షాలతో చాలా రోడ్లు అధ్వానంగా తయ్యారయ్యాయి. కోతకు గురికావడంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అలాగే కొన్నిచోట్ల రోడ్డుకు మధ్యలో కల్వర్టు సైతం ప్రమాదకరంగా మారాయి. మురుగు కాలువల నిర్వహణ పనుల్లో భాగంగా పైకప్పులను తొలగించిన సిబ్బంది ఆ తరువాత వాటిని అడ్డంగా వదిలేశారు. దీంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే కొన్నిచోట్ల మురుగునీరు సైతం రోడ్లపైకి వస్తుండడంతో ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. కోతకు గురైన రోడ్లను బాగు చేయాలని, కల్వర్లపై కప్పులను సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



టెక్కలిలోని మండాపాలం కాలనీ ఊర చెరువు సమీపంలో పాత జాతీయ రహదారిపై చేరిన మురుగు



టెక్కలి మేజర్ పంచాయతీ రామదాసుపేట వద్ద రోడ్డుకు అడ్డంగా ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు



కాశీబుగ్గ: మున్సిపాలిటీ ఐదోవార్డు తాళ్లభద్రలో ఇలా..



కాశీబుగ్గ: పలాస ఇందిరాచౌక్ వద్ద రోడ్డు పరిస్థితి



కాశీబుగ్గ: మందస మండలం సందరూ గ్రామం సమీపంలో ధ్వంసమైన రోడ్డు

మోసపూరిత పెన్షన్ స్కీం వద్దు



టెక్కలి: నిరసనలో ఉపాధ్యాయ సంఘ నాయకులు



కవిటి:ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు



కాశీబుగ్గ: పలాస తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయుల ధర్నా

టెక్కలి: ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన యూపీఎస్ వంటి పెన్షన్ స్కీమ్‌లు తమకు వద్దంటూ ఆదివారం టెక్కలిలో ఏపీటీఎఫ్(257) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బి.నేతాజీ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని, జీపీఎస్, యూపీఎస్ వంటి పెన్షన్ స్కీమ్‌లు కాకుండా పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఐఆర్‌తో పాటు పీఆర్‌సీను ప్రకటించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి మండలాలకు చెందిన యూనియన్ నాయకులు టి.బాబూరావు, జి.శ్రీనివాసరావు, ఎం.మల్లేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, హెచ్.శివప్రసాద్, చంద్రశేఖర్, రామారావు, ధనుంజయరెడ్డి, తాతన్నాయుడు పాల్గొన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించండి

కవిటి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమకు పాత పెన్షన్ విధానం తక్షణమే అమలు చర్యలు చేపట్టాలని ఏపీ కంట్రిబ్యూటరీ పెన్షన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఏడాది లోపున సీపీఎస్ రద్దు అంశాన్ని పరిష్కరిస్తామని ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తమకు సీపీఎస్‌ను రద్దు ప్రక్రియను వెంటనే చర్యలు ప్రారంభించాలని వినతిపత్రంలో కోరారు. పాతపెన్షన్ అందించి తమ కుటుంబాలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు శ్రీరాంబిసాయి, గార రాంబాబు, ఎ.హిమకుమార్, నగేష్, జి.వంశీ, జానకీరావు, భార్గవ్, ప్రకాశ్, గోపి, ధర్మారావు ఉన్నారు.

☛ **కాశీబుగ్గ:** సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ విధానాలను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని కోరుతూ పలాస తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల సుభాష్‌బాబు, పలాస ముఖ్య నాయకులు పి.వి.రమణ, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామన్నాయుడు, టి.వి.ఎస్.నారాయణ, డి.తులసీరావు, కె.వెంకటరావు పాల్గొన్నారు.

☛ **ఇచ్ఛాపురం:** సీపీఎస్ విధానంతో జీవన భద్రత లేదని వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి చాణక్య డిమాండ్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఉద్యోగి వాటాలేని పాత పింఛన్ విధానమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ కవిటి మండల ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఎల్.ఆనందరావు, కర్రి పాపారావు, గుంటుకు శ్రీధర్, పి.రమేష్, పి.పాపారావు, చాన్సు ల్తానా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

☛ **సోంపేట:** ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని ఏపీటీఎఫ్ ప్రతినిధులు కోరారు. సోంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. సీపీఎస్, జీపీఎస్, యూపీఎస్ పేర్లతో ప్రభుత్వాలు ఉద్యోగులను వంచిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, సోంపేట, కంచిలి, మందస మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.డిల్లీరావు, జి.తిరుపతిరావు, ఆర్.కామరాజు, కె.షణ్ముఖరావు, ఎస్.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

కుమార్‌నాయక్‌కు ఉద్దానబంధు అవార్డు ప్రదానం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో జానపద కళలకు జీవం పోస్తూ సాహితీ, కళాకారులు, కవులను పోత్సహిస్తున్న సినీనటుడు, ప్రముఖ కళాకారుడు డాక్టర్ కుమార్ నాయక్‌కు ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక 'ఉద్దాన బంధు' అవార్డుతో సత్కరించింది. ఈ మేరకు డోకులపాడులో ఆదివారం సర్పంచ్ వడ్డి సరిత కర్ణకర్ అధ్యక్షతన నిర్వహించిన కవి సమ్మేళన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కుమార్ నాయక్ ఉద్దానంలో అనేక మంది కళాకారులను గుర్తించి వారిని కళారంగం వైపు నడిపించారని అన్నారు. సాహితీ, కవులు, కళాకారులు, కళాఖండాలపై అభిరుచితో కళల అభివృద్ధికి ఎనలేని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉద్దాన సాహితీ సాంస్కృతిక వేదిక అధ్యక్షులు లండ రుద్రమూర్తి, కార్యదర్శి కుత్తుం వినోద్, సిక్కోలు జానపద కళావేదిక అధ్యక్షులు రాపాక ధనరాజు, జనజాగృతి వ్యవస్థాపకులు తెప్పల కృష్ణమూర్తి, మద్దు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కుమార్‌నాయక్‌ను సత్కరిస్తున్న వేదిక సభ్యులు

చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

• ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు



మాట్లాడుతున్న ఇచ్ఛాపురం సీఐ చిన్నంనాయుడు



కంచిలి: బూరగాంలో ఉత్సవ కమిటీకి నిబంధనలు వివరిస్తున్న సోంపేట సీఐ మంగరాజు, ఎస్ఐ రాజేష్

కవిటి: వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించే కమిటీలు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.చిన్నంనాయుడు స్పష్టం చేశారు. గణేష్‌ఉత్సవ్.డాట్.నెట్ యాప్‌లో పూజా కమిటీ సభ్యుల వివరాలతో దరఖాస్తులు సమర్పించి ముందస్తు అనుమతులు పొందాలని సూచించారు. కవిటి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గణేష్ డాట్‌నెట్ అనే యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈ యాప్ ఓపెన్ చేస్తే ఇందుకు సంబంధించిన దరఖాస్తుఫారం ఓపెన్ అవుతుందన్నారు. ఆ యాప్‌లో అడిగిన వివరాల్ని పొందుపరిచి సబ్‌మిట్ ఆప్షన్ కొడితే ఆ దరఖాస్తు తమకు చేరుతుందన్నారు. ఈ దరఖాస్తు అందిన ఏరియాకు రెవెన్యూ, పోలీస్, విద్యుత్, ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారుల బృందం వచ్చి వినాయక మండపం పెట్టిన ప్రదేశం, ఎన్నిరోజులు పూజలు నిర్వహిస్తారు, ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు, ఎప్పుడు నిమజ్జనం ఊరేగింపు యాత్ర చేస్తారు, ఎక్కడ నిమజ్జనం చేస్తారు అనే విషయాలను నమోదు చేసుకుంటుమన్నారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ఉండేందుకు అవసరమైన అన్ని ముందుజాగ్రత్త చర్యలు ఈ వివరాల సాయంతో తీసుకుంటామన్నారు. ప్రజలంతా పోలీసుశాఖతో సహకరించి ప్రశాంతమైన, ఆధ్యాత్మిక వాతావరణంలో నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సై కె.రాము కోరారు.

☛ **కంచిలి:** గణేష్ మండపాల ఏర్పాటు కోసం ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని సోంపేట సీఐ బి.మంగరాజు అన్నారు. బూరగాం గ్రామంలో స్థానిక ఎస్సై జి.రాజేష్‌తో కలిసి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక పూజా కమిటీలతో మాట్లాడుతూ.. గణేష్ మండపాలు, విగ్రహాలు ఏర్పాటు విషయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అన్నారు. మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేసుకోవాలని, ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లను ఉపయోగించరాదని, స్పీకర్లను ఉదయం ఆరు నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు.

☛ **కాశీబుగ్గ:** వినాయక చవితి ఉత్సవాలను సంతోషంగా జరుపుకోవాలని కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాడి మోహనరావు కోరారు. కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఉత్సవాలకు సంబంధించి మండపాల ఏర్పాటుకు విధిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని కమిటీ సభ్యులకు సూచించారు.



కాశీబుగ్గ: మాట్లాడుతున్న సీఐ మోహనరావు

☛ **కోటబొమ్మాళి:** ఈ నెల ఏడో తేదీ నుంచి జరగనున్న జరగనున్న గణేష్ ఉత్సవాలకు నిర్వాహకులు ముందుగా పోలీసు, విద్యుత్, అగ్నిమాపకశాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని..అందుకు సంబంధించి జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారని కోటబొమ్మాళి ఎస్ఐ మహమ్మద్ అలి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

శాస్త్రోక్తంగా గాయత్రీ హోమం

కాశీబుగ్గ: మందస మండలంలోని పిడిమందస, వీరగున్నమ్మపురం, కుంటికోట పరిధిలో ఉన్న భల్లూకగిరిపై శ్రీరామానంద యోగాశ్రమంలో ఆదివారం గాయత్రీ హోమం, సత్సంగం, భజన కార్యక్రమాలు ఆదివారం శాస్త్రోక్తంగా జరిగాయి. అఖిలాంధ్ర సాధు పరిషత్ సభ్యులు, గౌరవ పీఠాధిపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆశ్రమ శ్రేయోభిలాషులు, భక్తులు, చుట్టు ప్రక్కల గ్రామాలలో పెద్దలు కార్యక్రమానికి హాజరయ్యారు.

మాతృభాష పరిరక్షణ అందరి బాధ్యత

వజ్రపుకొత్తూరు రూరల్: మాతృభాషను, తెలుగు సంస్కృతిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఉద్దానం సాహితీ సంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు లండ రుద్రమూర్తి అన్నారు. డోకులపాడులో ఆదివారం మాజీ సర్పంచ్ అంబటి రామకృష్ణ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం, ఉద్దాన సాహితీ సంస్కృతి సమాఖ్య నాలుగో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి కవితలు, పాటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన రచయితలు, కవులకు బహుమతులు అందజేశారు. మాతృభాషాభివృద్ధికి గిడుగు వెంకట రామమూర్తి పంతులు ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ కవులు, రచయితలు, కళాకారులు బమ్మిడి సుబ్బారావు, వంకల రాజారావు, వడ్డి కరుణాకర్, కుమార్ నాయక్, కుత్తుం వినోద్, తెప్పల కృష్ణమూర్తి ఉన్నారు.



బహుమతులు అందుకున్న కవులు, రచయితలతో సమాఖ్య సభ్యులు

ఉద్యోగస్తులను ఇబ్బంది పెట్టేవారిపై చర్యలు తీసుకోండి

• మున్సిపల్ వైస్ చైర్మన్ సురేష్‌బాబు



కాశీబుగ్గ: కాశీబుగ్గ, పలాస జంట పట్టణాలలో పలు విషయాలపై సమాచార హక్కు చట్టం వివరాలు తెలియజేయండి అంటూ అధికారులను కొంతమంది ఇబ్బందులు పెడుతున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు అన్నారు. నాలుగో వార్డు పద్మనాభపురం కాలనీలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. సమాచార హక్కు చట్టాన్ని కేవలం ఏదైనా సమాచారం తెలుసుకోవడానికి మాత్రమే వినియోగించాలి తప్పితే క్యాష్ చేసుకోవడానికి కాదని అన్నారు. మున్సిపాలిటీలో గత పాలక మండలిలో ఓ సభ్యురాలి భర్త మున్సిపల్ అధికారులకు బ్లాక్ మెయిల్ చేస్తున్నారని అన్నారు. ప్రతీ అంశంపై సమాచార హక్కు చట్టంలో భాగంగా వివరాలు ఇవ్వమని చెప్పి రోజూ మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారులను పనిచేయనీయడం లేదన్నారు. ఈ సమస్యను తట్టుకోలేక కొంతమంది ఉద్యోగులు బదిలీలపై వెళ్లిపోతున్నారని, కొత్తవారు రావడానికి ఇష్టపెట్టుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి పనులు జరుగుతున్నా అక్కడ కూడా వాలిపోతున్నారన్నారు. ఇలాంటి వారిపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

కాశీ ఉత్సవాల్లో టెక్కలి కళాకారుల ప్రదర్శన

టెక్కలి: కాశీలో జరుగుతున్న ఉత్సవాల్లో టెక్కలికి చెందిన కళాకారులు పాల్గొని కూచిపూడి ప్రదర్శన ఇచ్చారు. టెక్కలికి చెందిన లలితా నాట్యాలయానికి చెందిన శ్రీరాములు శిష్య బృందం ఆధ్వర్యంలో అష్టలక్ష్మి నమోస్తుతే నృత్య రూపక ప్రదర్శనలు చేశారు.



కాశీలో టెక్కలి కళాకారులు